nipuna
Every Wednesday Free Supplement
05.
10 జనవరి 2024
పేజీలు 8

### జలమండలికి అవార్డు

హైదరాబాద్ జలమండలికి 'పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) నేషనల్ అవార్డు– 2023 లభించింది. ఇంటర్నేషనల్ పబ్లిక్ రిలేషన్స్ ఫెస్టివల్– 2023లో 'కాఫీ టేబుల్ బుక్' కేటగిరీలో జలమండలికి ద్వితీయ బహుమతి దక్కింది. నవంబర్ 27న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. జలమండలి పీఆర్ఎస్ఐ నేషనల్ అవార్డు గెలుచుకోవడం వరుసగా ఇది నాలుగోసారి. జలమండలి 2023లో 5 పురస్కారాలను గెలుచుకుంది. 2023, మార్చి 18న వరల్డ్ వాటర్, మే 1న ఉత్తమ యాజమాన్య, జూలై 15న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ), ఆగస్టు 1న గ్లోబల్ ఇన్నోవేషన్ ఇన్ వాటర్ టెక్నాలజీ– 2023 అవార్డులు లభించాయి.



# ఎక్సలెంట్.. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

- **నిరుపేద విద్యార్థులకు వరంగా ప్రతిభా కళాశాలలు**
- **ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం**
- **చివరితేదీ జనవరి 15**
- **రాత పరీక్ష ఫిబ్రవరి 4**

- ఐఐటీ, మెడిసిన్ తదితర ఉన్నత విద్యనభ్యసించాలనే పేద, మధ్యతరగతి విద్యార్థులకు రాష్ట్రంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)లు వరంగా నిలుస్తున్నాయి. వారి కలలను సాకారం చేస్తున్నాయి. ప్రతిభకు మెరుగులద్దుతున్నాయి. సరైన అవకాశాలు, నాణ్యమైన విద్య అందిస్తే గ్రామీణ పల్లెల్లోని నిరుపేద విద్యార్థులు కూడా ఐఐటీ, బిట్–జేఈఈ, నీట్ తదితర జాతీయస్థాయి పరీక్షల్లో సైతం సత్తా చాటగలరని, డాక్టర్లు, ఇంజినీర్లుగా ఎదుగుతారనే సత్యాన్ని గురుకులాలు ఎలుగెత్తి చాటుతున్నాయి.
- రాష్ట్ర ఏర్పాటు అనంతరం తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 1019 గురుకులాలను ఏర్పాటు చేసి ఇంటర్, డిగ్రీతోపాటు నాణ్యమైన విద్యను అందిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఎస్సీ గురుకుల సొసైటీల ఆధ్వర్యంలో 38 గురుకుల కళాశాలలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ప్రతిభా కళాశాలలు)గా తీర్చిదిద్దారు. ఆయా ప్రతిభా కాలేజీల్లోకి మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేసి ఐఐటీ, జేఈఈ, నీట్‌తో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో శిక్షణ ఇస్తున్నారు. పోటీపరీక్షలకు కూడా ఇంటెన్సివ్ కోచింగ్ ఉచితంగా అందిస్తున్నారు. ఫలితంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల విద్యార్థులు ఉన్నత విద్యారంగంలోకి ప్రవేశివేస్తున్నారు. అంతేకాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందిన ఉన్నత విద్యాసంస్థల్లోనూ అడ్మిషన్లు పొందుతున్నారు.

## ఇంటెన్సివ్ కోచింగ్

- కార్పొరేట్ స్థాయిలో ఐఐటీ, జేఈఈ, నీట్ తదితర రాష్ట్ర, జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షలకు ఎంపీసీ, బైపీసీ కేటగిరీల్లో బాలికలు, బాలురకు వేర్వేరుగా ఇంటెన్సివ్ ఇంటర్ విద్యను అందిస్తున్నారు. సాధారణంగా ఇంటర్ విద్యను అందించే గురుకులాల్లో ఒక పిరియడ్ 45 నిమిషాల పాటు ఉంటుంది. సీఈవోల్లో మాత్రం 120 నిమిషాలు. మొదటి గంట ఇంటర్మీడియట్ స్థాయికి సంబంధించిన అంశాలను వివరిస్తారు. తర్వాత నీట్, జేఈఈ ప్రవేశ పరీక్షలో ఆయా సబ్జెక్ట్‌ల్లో వచ్చే ప్రశ్నలు అంశాలను లోతుగా వివరిస్తారు. ప్రతి అంశం వారీగా వారం చివరలో మాక్ టెస్టులను, నెలకోసారి స్టిమ్యులేటివ్ పరీక్షను నిర్వహిస్తారు. 'బ్యాక్ టు బేసిక్స్' పేరిట సీఈవో విద్యార్థులతో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధింపజేస్తారు. తద్వారా విద్యార్థుల్లో ఆయా తరగతుల్లో నేర్చుకున్న అంశాలను పునఃశ్చరణ చేయించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తారు. గత పేపర్లను ప్రాక్టీస్ చేయిస్తారు. ఏటా నవంబర్ నాటికి సిలబస్‌ను పూర్తి చేసి, రివిజన్ చేస్తారు. ఇంటర్ ఎగ్జామ్స్ పూర్తికాగానే పోటీపరీక్షలకు సంబంధించిన శిక్షణ కొనసాగిస్తారు. ప్రతిరోజు సవాళ్లతో కూడిన ప్రశ్నలను సంధిస్తూ, వాటిని సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందిస్తూ పోటీతత్వాన్ని, జిజ్ఞాసను పెంపొందిస్తున్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధను చూపుతూ, పరీక్షల్లో వస్తున్న మార్కుల ఆధారంగా కౌన్సిలింగ్ నిర్వహిస్తూ వారి లోపాలను సవరిస్తున్నారు.

## పెరుగుతున్న డిమాండ్

- ఇంటెన్సివ్ కోచింగ్ ఫలితంగా గురుకుల విద్యార్థులు నీట్, జేఈఈ పరీక్షల్లో సత్తా చాటుతున్నారు. ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌తో పాటు ప్రముఖ ఐఐటీ, నిట్ క్యాంపస్‌లలో ప్రవేశాలు పొందుతున్నారు. ఇప్పటి వరకు 856 మంది మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధించారు.
- మొదటి బ్యాచ్ విద్యార్థులు మెడిసిన్, ఇంజినీరింగ్ పూర్తి చేసి సేవలను అందిస్తుండటం తెలంగాణ గురుకులాలకు గర్వకారణం. డెంటల్, ఫార్మా, వెటర్నరీ, హోమియోపతి తదితర కోర్సుల్లోనూ ఉన్నత విద్యాసంస్థల్లో 1951 మంది సీట్లు సాధించారు. ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ, ఎన్ఐటీ, ఇంజినీరింగ్ కాలేజీల్లో దాదాపు 4911 మంది ప్రవేశం పొందారు. ఇవేగాకుండా నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ప్రతిష్ఠాత్మక అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ తదితర అగ్రశ్రేణి కేంద్రీయ విశ్వవిద్యాలయాలు నిర్వహించే పరీక్షల్లో సత్తా చాటుతూ ప్రవేశాలు పొందుతున్నారు. మొత్తంగా 8542 మంది విద్యార్థులు ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలను పొంది బంగారు భవితకు బాటలు వేసుకున్నారు. ప్రతి విద్యార్థికి ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు, ల్యాప్‌ట్యాప్ అందిస్తుంది. నిట్, ఐఐటీ, ఎంబీబీఎస్ సాధించిన విద్యార్థులకు రూ.50 వేలు, జీఐఎఫ్‌టీ సాధించిన విద్యార్థులకు రూ.40 వేలు అందిస్తుంది. దీంతో సోషల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో 38 సీవోఈల్లో ప్రవేశాలకు ఏటికేడు పోటీ పెరుగుతున్నది. 3650 సీట్లకు గతేడాది దాదాపు 80 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయంటే సీవోఈల డిమాండ్ గురించి అర్థం చేసుకోవచ్చు. 2024–25 విద్యాసంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. జనవరి 15వ తేదీలోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. ఫిబ్రవరి 4న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు సొసైటీ సెక్రటరీ నవీన్ నికోలస్ వెల్లడించారు.

**సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కాలేజీల వివరాలు..**

| వర్గం | కాలేజీలు | ఎంపీసీ | బైపీసీ | ఎంఈసీ | సీఈసీ | సీట్లు |
|---|---|---|---|---|---|---|
| బాలికలు | 20 | 880 | 880 | 120 | 40 | 1920 |
| బాలురు | 17 | 760 | 760 | 40 | 40 | 1600 |
| కో ఎడ్యుకేషన్ | 1 (కరీంనగర్) | 80 | 80 | 0 | 0 | 160 |
| మొత్తం | 38 | 1720 | 1720 | 160 | 80 | 3680 |

## అర్హతలు

- తెలంగాణకు చెందిన విద్యార్థులు మాత్రమే అర్హులు.
- గతేడాది పదోతరగతి పూర్తిచేసినవారు, ఏడాది పదోతరగతి పరీక్షలు రాస్తున్నవారు మాత్రమే.
- 31.08.2024 నాటికి 17ఏళ్లు మించని విద్యార్థులు మాత్రమే. ఎస్సీ విద్యార్థులకు రెండేండ్ల సడలింపు ఉంటుంది.
- పట్టణప్రాంత విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు మించొద్దు.
- జనవరి 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో www.tswreis.ac.in <http://www.tswreis.ac.in>, <https://tsswreisjc.cgg.gov.in>.వెబ్‌సైట్ ద్వారా రూ.200 ఫీజు చెల్లించి దరఖాస్తులను సమర్పించాలి.

## ఎంపిక ప్రక్రియ..

- దరఖాస్తు చేసుకున్న ఎంపీసీ, బైపీసీ ప్రవేశాలకు రెండంచెల స్క్రీనింగ్ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు.
- మొదట ఇంగ్లిష్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, అంశాల్లో 160 మార్కులకు ఫిబ్రవరి 4న రాత పరీక్ష నిర్వహిస్తారు.
- అందులో మెరిట్ సాధించిన అభ్యర్థుల్లో 1:5 నిష్పత్తిలో రెండో స్క్రీనింగ్ పరీక్షకు ఎంపిక చేస్తారు.
- ఎంపికైన విద్యార్థులను రెండో అంచెలో ఫిబ్రవరి 25న ఎంపిక చేసిన సెంటర్లలోనే 150 మార్కులకు మళ్లీ పరీక్ష నిర్వహిస్తారు.
- ఆ తర్వాత ఎస్సీలకు 75 శాతం, బీసీలకు 12 శాతం, ఎస్టీలకు 6 శాతం, మైనార్టీలకు 3 శాతం, ఇతరులకు మిగిలిన సీట్లు రిజర్వ్ చేసి, ఆ మేరకు మెరిట్ జాబితాను ప్రకటించి ప్రవేశాలు కల్పిస్తారు.
- ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు ఒకేసారి ఇంగ్లిష్, గణితం, సోషల్, జీకే, కరెంట్ అఫైర్స్ అంశాల్లో 160 మార్కులకు రాత పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

### అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



- ప్రతిభా కళాశాలలు అద్భుత విజయాలకు, అనితర సాధ్యమైన ప్రతిభాపాటవాలకు చిరునామాగా నిలుస్తున్నాయి. ఉచిత విద్యను అందించడంతో పాటు నిరుపేద విద్యార్థులకు పైసా ఖర్చు లేకుండా ఐఐటీ, నీట్ తదితర జాతీయస్థాయి పరీక్షల్లో కార్పొరేట్‌కు దీటుగా లాంగ్‌టర్మ్ కోచింగ్ అందిస్తున్నాం. అట్టడుగువర్గాల పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు అత్యున్నత స్థాయికి వెళ్లేందుకు గురుకులాలు బాటలు వేస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు, వినూత్న నిర్ణయాల వల్లే ఈ ఫలితాలు. ఈ అవకాశాన్ని నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

**నవీన్ నికోలస్, సెక్రటరీ, సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయాల సంస్థ**

**మ్యాకం రవికుమార్**

## 3వ పేజీ తరువాయి

- జమ్మూకశ్మీర్‌ను భారత్‌లో కలిపితే 1947లో మహారాజు హరిసింగ్ సంతకం చేసిన విలీన పత్రంలో ఆ రాష్ట్రంపై మహారాజు సార్వభౌమత్వం కొనసాగుతుందని చెప్పే నిబంధనలేవీ లేవు. భారత రాజ్యాంగమే సర్వోన్నతం అని 1949 నవంబర్ 25న జమ్మూకశ్మీర్ కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. జమ్మూకశ్మీర్ భారత్‌లో ఒక రాష్ట్రం అని రాజ్యాంగ ప్రకరణ 1 స్పష్టం చేస్తుంది. జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలితాలుగా విభజిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు పేర్కొంది. అదేవిధంగా ఏ రాష్ట్రం నుంచైనా కొంత భాగాన్ని విడదీసి కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పాటు చేసే అధికారం ప్రకరణ 3(ఎ) ప్రకారం కేంద్రానికి ఉందని, కాబట్టి లడఖ్ కేంద్రపాలిత ప్రాంత ఏర్పాటు చెల్లుబాటవుతుందని తెలిపింది.
- సొలిసిటర్ జనరల్ పేర్కొన్న విధంగా సాధ్యమైనంత త్వరలో జమ్మూకశ్మీర్ ప్రాంతాన్ని రాష్ట్రంగా చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని 2024, సెప్టెంబర్ 30 లోగా ఆ ప్రాంతంలో ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది.
- ఈ సారాంశం గల 352 పేజీల తీర్పును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ రాయగా, మిగతా నలుగురు న్యాయమూర్తులైన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ ఏకగ్రీవంగా ఆమోదించారు. జస్టిస్ కౌల్, జస్టిస్ ఖన్నా విడివిడిగా తమ తీర్పులను కూడా ప్రత్యేకంగా రాశారు. దీంతో ఈ కేసులో మొత్తం 3 తీర్పులు వెలువడినట్లయ్యింది. జస్టిస్ కౌల్ తన తీర్పులో 1980ల నుంచి కశ్మీర్ లోయలో ప్రభుత్వపరంగా, ప్రభుత్వేతరంగా జరిగిన మానవ హక్కుల ఉల్లంఘనపై స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేసి అప్పటి దారుణాలపై నిష్పక్షపాతంగా పూర్తి స్థాయి దర్యాప్తు జరిపించాలని స్వతహాగా కశ్మీరీ పండిట్ అయిన కౌల్ ప్రత్యేక తీర్పు ద్వారా వెల్లడించారు.
- జస్టిస్ సంజీవ్ ఖన్నా తన ప్రత్యేక తీర్పులో రాష్ట్రాలను కేంద్ర పాలితాలుగా మార్చడంపై ఆందోళన వెలిబుచ్చారు. ఈ చర్యలు సమాఖ్య త్వానికి అడ్డంకిగా మారుతాయని, ప్రజలకు ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలు లేకుండా చేస్తాయని అందువల్ల కేంద్ర పాలిత ప్రాంతాలను ఏర్పాటు చేయాలంటే సహేతుకమైన గట్టి కారణాలుండాలని రాజ్యాంగంలో ప్రకరణ 3లో పొందుపరిచిన అన్ని నియమ నిబంధనలను పూర్తిగా అనుసరిస్తూ మాత్రమే కేంద్రపాలిత ప్రాంతాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

**ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో వచ్చిన మార్పులు**

- జమ్మూకశ్మీర్ ప్రత్యేక పతాకం, రాజ్యాంగం, గీతం రద్దయ్యాయి. అన్ని కేంద్ర చట్టాలూ ఇక్కడ అమలవుతాయి. స్వయం ప్రతిపత్తి ఉండదు.
- ఈ ప్రాంతంలో ఇకపై ఎవరైనా భూమి కొనుగోలు చేయవచ్చు. బదిలీ చేయవచ్చు. శాశ్వత నివాసం ఏర్పరచుకోవచ్చు.
- రణబీర్ శిక్షాస్మృతి స్థానంలో భారతీయ శిక్షాస్మృతి అమల్లోకి వచ్చింది.
- ద్వంద్వ పౌరసత్వం రద్దవుతుంది. కేవలం భారత పౌరసత్వమే లభిస్తుంది.
- జిల్లా స్థాయి అభివృద్ధి మండళ్ల (డీడీసీ)ను ఏర్పాటు చేశారు. దీని సభ్యులు నేరుగా ప్రజల ద్వారా ఎన్నికవుతారు.